RNI No: APTEL/2018/76747

# నవతరం

DYNAMIC EDITION తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | గురువారం | సంపుటి: 9 | సంచిక: 249 | పేజీలు: 04 | వెల: 5 /- | 01 అక్టోబర్ 2026 |

# ప్రభుత్వ భూమిలో నాలుగు అంతస్తులు






సైబరాబాద్, నవతరం: కుత్బుల్లాపూర్ జోన్ గాజులరామారం సర్కిల్ - 57 లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా నిర్మాణాలు కొనసాగుతున్నా ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం తమ ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారు. ఎటు చూసినా అక్రమ నిర్మాణాలు కండ్లకు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నా తమకు ఎలాంటి సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఒకవైపు అనుమతుల్లేని బహుళ అంతస్తుల నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నా.. తమదైన శైలిలో విధులు నిర్వహిస్తూ.. గాజులరామారం సర్కిల్ - 57 డిప్యూటీ కమిషనర్ ఒంటెద్దు పోకడలకు పోతున్నారు. అందులో భాగంగానే ఇక్కడి అక్రమ నిర్మాణాలను పూర్తిగా నివారించాల్సింది పోయి.. ఎలాంటి అనుమతులు లేకున్నా నాలుగైదు అంతస్తుల నిర్మాణాలు వెలుస్తున్నా.. కేవలం పైన అంతస్థులోని శ్లాబ్ ని కొంతభాగం తొలగించి ఫోటో ఘూట్ చేసుకుని ఉన్నతాధికారులను మాయ చేస్తూ.. అడ్డదారిన వసూళ్లకు పాల్పడుతున్నట్టు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేని బహుళ అంతస్తుల భవనాలను పూర్తిగా తొలగించాల్సి ఉండగా, తూ.. తూ.. మంత్రపు చర్యలు తీసుకుంటున్నారంటే.. అందులో చాలా రకాల అర్థాలున్నాయంటున్నారు ఇక్కడి జనం. గాజులరామారం దేవేందర్ నగర్, రావి నారాయణ రెడ్డి నగర్, బందా నవాజ్ బస్తీ, మహదేవపురం లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులే అలసత్వం వహిస్తే ఇంకా అక్రమ నిర్మాణాలు నిర్మాణం అవుతాయని అందుకు బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు స్థానిక ప్రజలు.

## రెవెన్యూ, మున్సిపల్ సమన్వయలోపం నిర్మాణదారులకు వరం

కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 329 లోని ప్రభుత్వ భూములను ఆక్రమించి బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపడుతుంటే స్థానిక రెవెన్యూ అధికారులకు మాత్రం అవేమ కనిపించడం లేదు. కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బందా నవాజ్ బస్తీ లోని ప్రభుత్వ భూముల్లో మోయినుద్దీన్ అనే వ్యక్తి 60 గజాల నోటరీ ప్లాట్ లో 75 గజాలు ఆక్రమించి నాలుగు అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేసే స్థాయికి వెళ్ళినా ఇక్కడి రెవెన్యూ అధికారులకు కనీసం తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. ఇదే ఇంటి నిర్మాణం విషయం స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలకు వచ్చినట్టే వచ్చి పత్తా లేకుండా వెళ్లిపోయారు. సదరు విషయం పై ఎన్నో ఫిర్యాదులు వచ్చినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ప్రభుత్వ భూముల్లో 4 అంతస్తుల నిర్మాణం ఎలా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదే నిర్మాణంపై పలుమార్లు స్థానికంగా రెవెన్యూ అధికారులకు సైతం ఓరల్ గా ఫిర్యాదులు చేసినా చర్యలు మాత్రం శూన్యంగా మిగిలాయి. ప్రభుత్వ భూమిలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనానికి పరోక్షంగా స్థానిక రెవెన్యూ అధికారులు మద్దతు తెలుపుతున్నట్టు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదే నిర్మాణంపై పలు మార్లు వార్తా కథనాలు ప్రచురించినా టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రెవెన్యూ కు చెబితే టౌన్ ప్లానింగ్ కి చెప్పండి అంటారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు చెబితే అటువైపు వెళ్లారు.. వెళ్ళినా వీరి ఆగడాలకు తట్టుకోలేక వెనుకంజ వేస్తారు. మొత్తంమీద ప్రభుత్వ భూమిలో నాలుగు అంతస్తుల నిర్మాణంపై మౌనం వహిస్తున్న రెవెన్యూ యంత్రాంగం ఏ ఒక్క గుడిసె వేసినా.. చిన్న రూము నిర్మించినా చర్యలు అప్పుడప్పుడు పూనుకుంటుంది. చిన్నపాటి అక్రమ నిర్మాణాలను కూల్చివేసే రెవెన్యూ యంత్రాంగం ఇంత ఘోరాన్ని ఎలా వదిలిపెడుతుందో వారికే తెలియాలి. 59 జీవో కి డబ్బులు చెల్లించలేదని చిన్నపాటి రూములను కూల్చిన ఇదే రెవెన్యూ అధికారులు.. ఈ బడా బిల్డింగ్ ను ఎందుకు వదిలేస్తున్నారో అంటూ పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజలు. జీరో అనుమతులతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టిన మోయినుద్దీన్ అతడి మద్దతుడారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుని, అక్రమ నిర్మాణాన్ని నేలమట్టం చేయాలని కుత్బుల్లాపూర్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.



## అక్రమనిర్మాణానికి అడ్డుకట్ట పడేనా...?

- జీరో పర్మిషన్ తో భవన నిర్మాణం
- ప్రభుత్వ భూమిలో అనుమతులతో పనేంటంటున్న నిర్మాణదారుడు
- సర్కిల్ - 57 లో రెచ్చిపోతున్న భవననిర్మాణదారుడు
- రోడ్డును సైతం ఆక్రమించిన నిర్మాణదారుడు
- 60 గజాలు కొనుక్కుని 75 గజల్లో భవన నిర్మాణం
- బంద నవాజ్ బస్తీలో అనుమతులతో పని లేదా...?
- దేవేందర్ నగర్ వైపు కన్నెత్తి చూడని టౌన్ప్లానింగ్ అధికారులు
- అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలంటూ ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్, నవతరం: ఎలాంటి అనుమతులు లేకుండా మూడు ఫీట్లు ముందుకు జరిగి రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడో ప్రబుద్ధుడు. ఇది గమనించిన బస్తీవాసులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా రెచ్చిపోతూ తననెవరేం చేయలేరు అంటూ ప్రగల్భాలు పలుకుతూ... జీరో నిర్మాణం కొనసాగిస్తున్నాడు సదరు అక్రమ నిర్మాణదారుడు. ఇదంతా కూడా బల్దియా సర్కిల్ 57లోని దేవేందర్ నగర్ బంద నవాజ్ బస్తిలోని ఓ బరితెగించిన నిర్మాణదారుడి కథ. జీరో అనుమతులతో ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్థుల భవన నిర్మాణానికి తెరలేపిన సదరు అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుని, తగిన చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇంటి నిర్మాణం కొరకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా బురిడీ కొట్టిస్తూ... అటు మున్సిపల్ అధికారులను, ఇటు బస్తీవాసులను బురిడీ కొట్టిస్తూ... నేను లీగల్ అంటున్న సదరు అక్రమ నిర్మాణదారుడి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలి

- **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**హైదరాబాద్, నవతరం:** 2027 మార్చిలో జరగనున్న మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు నియోజకవర్గాల వారిగా చేపడుతున్న పట్టభద్రుల అవగాహన సమావేశాల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ సర్కిల్ గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లు ముఖ్య అతిథులుగా హాజరై పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైందని, నవంబర్ 1, 2023 లోపు గ్రాడ్యుయేషన్ పూర్తయిన పట్టభద్రులు ఈ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, మన డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో గల పట్టభద్రులను గుర్తించి వెంటనే ఓటరు నమోదు చేయించాలన్నారు. గతంలో ఓటు వేసిన వారు కూడా మరోమారు ఓటును నమోదు చేసుకోవాలి. ఎందుకంటే గత ఎన్నికల్లోని ఓటరు జాబితా పూర్తిగా రద్దవుతుందని, నూతనంగా ఓటరు నమోదు చేసుకున్న వారితో కలిపి నూతన ఓటరు జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేస్తుంది. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్, వార్డు, బూత్ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రాడ్యుయేట్ ఓటర్లను చైతన్యపరచాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.










# జర్నలిస్టుల పోస్ట్ కార్డు ఉద్యమాన్ని విజయవంతం చేయండి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30 (నవతరం):** జర్నలిస్టులకు మెరుగైన ఆరోగ్య భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నగదు రహిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే 143) కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు సుగ్రీవుడు ముదిరాజ్ పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ పిలుపుమేరకు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వెంకట్ ఆదేశాల మేరకు దశలవారీ ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపింది. అక్టోబర్ 2 నుంచి 8వరకు జర్నలిస్టులు 50 పైసల పోస్ట్‌కార్డుల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తమ డిమాండ్లను తెలియజేయాలని కోరింది. జర్నలిస్టులకు వెంటనే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నగదు రహిత ఆరోగ్య కార్డులు జారీ చేయడంతో పాటు ఈహెచ్ఎస్ పథకాన్ని పునరుద్ధరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ పోస్ట్‌కార్డులను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపాలని సూచించింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అక్టోబర్ 2న ఉదయం 11 గంటలకు షాపూర్‌నగర్ పోస్టాఫీసు వద్ద పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం టీయుడబ్లుజె హెచ్143 అధ్యక్షుడు సుగ్రీవుడు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా నాయకులు కూడా హాజరుకానున్నందున నియోజకవర్గంలోని జర్నలిస్టులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీయుడబ్లుజె హెచ్143 కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు సుగ్రీవుడు ముదిరాజ్ కోరారు.



# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేక కార్యక్రమాల ప్రణాళిక

**హైదరాబాద్, నవతరం:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, హైదరాబాద్‌ను గేమింగ్, VFX మరియు యానిమేషన్ పరిశ్రమలకు జాతీయ మరియు అంతర్జాతీయ కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు తెలిపారు. హైదరాబాద్‌లోని 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లపై సీఎస్ ఈ రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యానిమేషన్, గేమింగ్, VFX మరియు ఇతర సృజనాత్మక, వినోద రంగాలకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత సంస్థలను ఆకర్షించడానికి మరియు హైదరాబాద్‌లో వారి కేంద్రాల ఏర్పాటుకు వీలు కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. "స్టోరీస్, గేమ్స్ & డ్రీమ్స్" (కథలు, ఆటలు & కలలు) అనే ఇతివృత్తంతో, యువతను ఆకట్టుకునే మరియు స్ఫూర్తినిచ్చేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. సమ్మిట్‌లో భాగంగా 'కామిక్, గేమింగ్ & VFX బిజినెస్ డే' కూడా నిర్వహించబడుతుంది. ఈ రంగాలలో సాంకేతికత, ఆవిష్కరణలు, పెట్టుబడి మరియు వ్యాపార అవకాశాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా నిలిచేలా... B2B ఎక్స్‌పో, ఇన్నోవేషన్ జోన్ మరియు యానిమేషన్ స్టాల్స్‌తో పాటు కామిక్-కాన్ (Comic Con), డ్రీమ్‌హాక్ (DreamHack) మరియు ఇండియా గేమ్ ఉత్సవ్‌లను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో ఇప్పటికే సుమారు 50 పెద్ద మరియు దాదాపు 150 మధ్య తరహా యానిమేషన్ మరియు గేమింగ్ కంపెనీలు ఉన్నాయని సీఎస్ చెప్పారు. మరిన్ని అంతర్జాతీయ కంపెనీలను హైదరాబాద్‌కు రప్పించడానికి మరియు ఈ అభివృద్ధి చెందుతున్న రంగాలలో యువతకు మెరుగైన అవకాశాలను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. సమ్మిట్‌లోని కార్యక్రమాలు మరియు ప్రదర్శనలను వీక్షించేందుకు హైదరాబాద్‌లోని పాఠశాలలు మరియు కళాశాలల విద్యార్థులను కూడా ఆహ్వానించనున్నారు. సుమారు 70 కళాశాలల విద్యార్థులు మరియు దాదాపు 50,000 మంది సందర్శకులు ఈ కార్యక్రమాలలో పాల్గొని, వాటిని అనుభవించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. యువతలో సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రోత్సహించడం, సృజనాత్మక, వినోద పరిశ్రమలకు హైదరాబాద్‌ను ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమాల లక్ష్యమని సీఎస్ తెలిపారు.





# మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా ఎస్కే జహాంగీర్

**మేడ్చల్ జిల్లా బ్యూరో, నవతరం:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మొహమ్మద్ ఆజం సమక్షంలో ఎస్కే. ఇమ్రాన్ తో పాటు కాంగ్రెస్ సేవాదళ్ సభ్యులు తౌఫిక్, రెహ్మాన్, షోయబ్, సోను పాల్గొని ఎస్కే. జహాంగీర్ కు నూతన బాధ్యతల సందర్భంగా అభినందనలు తెలియజేశారు. కాంగ్రెస్ సేవాదళ్‌ను మరింత బలోపేతం చేస్తూ, పార్టీ సిద్ధాంతాలు మరియు ప్రజాసేవ లక్ష్యాలతో ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూఎస్కే. జహాంగీర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈ సందర్భంగా ఎస్కే జహాంగీర్ మాట్లాడుతూ.. మాజీ కేంద్ర మంత్రి మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు సర్వే సత్యనారాయణ కు, వారి నిరంతర మద్దతు, ఆశీస్సులకు హృదయపూర్వక ధన్యవాదాలు... కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నా అంకితభావం మరియు సామర్థ్యాన్ని గుర్తించి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు సత్యనారాయణ కు నా కృతజ్ఞతలు. వారి దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ సేవాదళ్‌ను బలోపేతం చేయడానికి మరియు ప్రజలకు అండగా నిలవడానికి నా శాయశక్తులా కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. నాకు శుభాకాంక్షలు మరియు మద్దతు అందించిన శ్రీ మహమ్మద్ ఆజం (కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు), ఎస్.కె. ఇమ్రాన్, తౌఫీక్ చౌదరి, రెహమాన్, షోయబ్, సోను మరియు ఇతర సేవాదళ్ సహచరులకు, శ్రేయోభిలాషులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు అన్నారు.





# ఎమ్మెల్సీ టికెట్లపై తీన్మార్ మల్లన్న ఫైర్

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం రాజకీయంగా వేడి పుట్టించింది. రెండు సీట్లనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడంపై తెలంగాణ రాజ్య అధికార పార్టీ నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, సీనియర్ నేత జానారెడ్డి నాటకమాడారని సంచలన వ్యాఖ్యలు చేశారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించింది. దీనిపై మల్లన్న మాట్లాడుతూ... ఈ నిర్ణయం తనకు ఆశ్చర్యం కలిగించలేదన్నారు. "రెడ్డి పార్టీ రెడ్లకు కాకుండా బీసీలకు టికెట్లు ఇస్తేనే ఆశ్చర్యపడాలి" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోని రెడ్లు ఓ నాటకమాడారని, ఈ కేటాయింపుల వెనుక జానారెడ్డితో పాటు మరో టీచర్ ఎమ్మెల్సీ, ఇంకో రెడ్డి నేత కుట్ర ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు కేవలం 'బలిపశువులు' మాత్రమేనని మల్లన్న అభివర్ణించారు. పార్టీ గెలవడం కాదు, రెడ్లు గెలవాలన్నదే వారి లక్ష్యమని, దీని కోసం బీఆర్ఎస్‌లోని ఒక వ్యక్తితో రహస్య ఒప్పందం కూడా కుదిరిందని ఆరోపించారు. ఈ స్థానాల్లో కాంగ్రెస్‌కు గతంలో కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని, తాను గెలిచిన తర్వాతే అక్కడ ఆ పార్టీకి గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. ఈ ఎన్నికలు రెడ్లు, వెలమలకు, బీసీలకు మధ్య జరుగుతున్న పోరాటంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందన్నారు. తమ తెలంగాణ రాజ్య అధికార పార్టీ తరఫున రెండు స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపిస్తామని తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. తన అభ్యర్థిత్వంపై త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.



# 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం..

- **కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు**
- **సిరిసిల్లకు రూ.1,500 కోట్ల కేటాయింపు**
- **కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ**
- **బతుకమ్మ చీరలపై కమిషన్ల ఆరోపణలు**
- **దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు**

**సిరిసిల్ల, నవతరం:** సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.

**బతుకమ్మ చీరల్లోనూ కమిషన్లే**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు.

**దళితులపై చిన్నచూపా?**

అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు. ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్-2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.



# సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై సహోద్యోగి దాడి

**హైదరాబాద్, నవతరం:** హైదరాబాద్‌లో ఘోరం జరిగింది. ప్రేమను నిరాకరించిందన్న నెపంతో ఓ యువకుడు, తన సహోద్యోగి అయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై దాడికి తెగబడ్డాడు. శంషాబాద్ విమానాశ్రయం పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఝార్ఖండ్‌కు చెందిన 25 ఏళ్ల యువతి మాదాపూర్‌లో నివసిస్తూ, నగరంలోని ఓ ప్రముఖ ఐటీ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తోంది. అదే సంస్థలో పనిచేసే ఆకాశ్ అనే యువకుడు గత ఏడాది కాలంగా ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలు గతంలోనే మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పట్లో అతను వెనక్కి తగ్గాడు. ఈ నేపథ్యంలో, ఢిల్లీలోని బంధువుల ఇంటి నుంచి విమానంలో తిరిగి వస్తున్న ఆమెను శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆకాశ్ అడ్డగించాడు. ఆమెను బెదిరించి బలవంతంగా కారులో ఎక్కించుకుని హైదరాబాద్ వైపు తీసుకువెళ్లాడు. మార్గమధ్యలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆగ్రహించిన ఆకాశ్, యువతిపై పిడిగుద్దులతో విచక్షణారహితంగా దాడి చేశాడు. అనంతరం ఆమెను కారులో నుంచి కిందకు నెట్టేసి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీపం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శంషాబాద్ పోలీసులు, పరారీలో ఉన్న నిందితుడు ఆకాశ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

- **రాజస్థాన్‌కు 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం**
- **తెలంగాణ వనరులతో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడమేంటని ప్రశ్న**
- **రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ**

**హైదరాబాద్, నవతరం:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సింగరేణి నుంచి రాజస్థాన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగ నిర్వహణలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా ఉత్పత్తి అయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు చెందిన సంస్థకు కేటాయించడంపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచి, నీరు గోదావరి నది నుంచి సేకరిస్తున్నారని, అలాగే భూమి కూడా తెలంగాణదేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వనరులతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను మన అవసరాలకు వినియోగించకుండా వేరే రాష్ట్రానికి కేటాయించడంపై నిలదీశారు. తెలంగాణలో విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతుంటే, రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఇవ్వడానికి సిద్ధపడటం దారుణమని హరీశ్ రావు అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని తన లేఖలో స్పష్టం చేశారు.




# ఎన్నికలకు సిద్ధం అవుతా..

**హైదరాబాద్, నవతరం:** ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సంపూర్ణంగా గౌరవిస్తున్నానని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ పట్ల ఉన్న గౌరవంతోనే తాను న్యాయపోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ సీటు ఖాళీ అయినట్లు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. నేడు అత్యున్నత న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.



# పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

- తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్
- నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న
- తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా

**హైదరాబాద్, నవతరం:** పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.



# 8 మందిపై బినామీ చట్టం కింద కేసులు

- **సస్పెండైన డీఎస్పీ భీమ్‌రెడ్డి అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం**
- **ఏసీబీ దర్యాప్తుతో పాటు రంగంలోకి దిగిన ఆదాయపు పన్ను శాఖ**
- **భీమ్‌రెడ్డి బినామీలుగా అనుమానిస్తున్న 8 మందిపై కేసులు నమోదు**
- **దేశంలోనే తొలిసారిగా బినామీ చట్టం కింద ఈ తరహా కేసులు**
- **ఇప్పటికే రూ.200 కోట్లకు పైగా ఆస్తులను గుర్తించిన దర్యాప్తు సంస్థలు**

**హైదరాబాద్, నవతరం:** అక్రమాస్తుల కేసులో సస్పెండైన తెలంగాణ మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి వ్యవహారంలో దర్యాప్తు సంస్థలు దూకుడు పెంచాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తు కొనసాగుతుండగానే, తాజాగా ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కూడా రంగంలోకి దిగింది. భీమ్‌రెడ్డికి బినామీలుగా వ్యవహరించారని అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ఆస్తుల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయడం సంచలనం సృష్టిస్తోంది. దేశంలోనే ఈ చట్టం కింద ఇలాంటి కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి అని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ కేసులో దర్యాప్తు మరింత తీవ్రరూపం దాల్చింది. డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో భీమ్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. జూన్ 27న కేసు నమోదైన తర్వాత తెలంగాణ, కర్ణాటకలోని 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.200 కోట్లకు పైగా విలువైన భూములు, ఇళ్లు, ప్లాట్లు, బ్యాంకు డిపాజిట్లను గుర్తించినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. ఈ భారీ ఆస్తుల గుర్తింపుతో కేసు తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఏసీబీ దర్యాప్తులో కొన్ని ఆస్తులు ఇతరుల పేర్లతో ఉన్నట్లు తేలింది. వీటి వెనుక భీమ్‌రెడ్డి పెట్టుబడులు ఉన్నాయనే అనుమానంతో అధికారులు బినామీ కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఇందుకోసం కోర్టు నుంచి ప్రత్యేకంగా సెర్చ్ వారెంట్లు పొంది, భీమ్‌రెడ్డికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటేష్ సహా మొత్తం 8 మంది ఇళ్లలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీల్లో కీలకమైన ఆస్తుల పత్రాలు, నగదు, బంగారంతో పాటు ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అందించిన సమాచారం ఆధారంగా ఐటీ శాఖ ఈ కేసులో కీలక అడుగు వేసింది. భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసింది. ఈ ఆస్తుల కొనుగోలుకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆస్తులకు అసలు యజమాని ఎవరు? వాటిని ప్రస్తుతం ఎవరు నియంత్రిస్తున్నారు? అనే కోణాల్లో ఐటీ అధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు. బినామీ చట్టం కింద కేసులు నమోదైన నేపథ్యంలో, దర్యాప్తులో ఆరోపణలు రుజువైతే సంబంధిత ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. ఈ కేసులో సుమారు 57 రోజుల పాటు చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న భీమ్‌రెడ్డి, సెప్టెంబర్ 1న బెయిల్‌పై విడుదలయ్యారు. అయినప్పటికీ, ఆయనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఏసీబీ ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువే రూ.200 కోట్లకు పైగా ఉండగా, బినామీ ఆస్తులు కూడా వెలుగులోకి వస్తే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏసీబీ, ఐటీ శాఖలతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసులో భీమ్‌రెడ్డితో పాటు ఆయన బినామీల చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోందని స్పష్టమవుతోంది.



సస్పెన్షన్‌కు గురైన డీఎస్పీ భీమ్ రెడ్డికి చెందిన ఒక బినామీ వద్ద రూ. 1.3 కోట్ల నగదు లభ్యమైంది. హైదరాబాద్‌లో, సస్పెండైన డీఎస్పీ సంకిరెడ్డి భీమ్ రెడ్డితో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న ఎనిమిది మంది బినామీల ఇళ్లలో అవినీతి నిరోధక శాఖ (ACB) గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. భీమ్ రెడ్డిపై నమోదైన అక్రమాస్తుల కేసు దర్యాప్తులో భాగంగా పుప్పలగూడ మరియు ఇతర ప్రాంతాలలో ఈ సోదాలు జరిగాయి.






# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం

- **గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన**
- **రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికే అవకాశం**
- **ఇది సామాజిక అన్యాయమంటూ కవిత తీవ్ర విమర్శ**



**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడం పూర్తి సామాజిక అన్యాయమని ఆమె ఆరోపించారు. మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ ఇద్దరు అభ్యర్థులు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా కవిత స్పందించారు. "రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీట్లు... రెండు చోట్లా రెడ్డి నేతలకే టికెట్లు... ఇది పూర్తి సామాజిక అన్యాయం కాదా?" అని ఆమె ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో బలహీన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంటుందని, కేవలం ఒకే వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం తెలంగాణ ఆత్మగౌరవానికి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని బరిలోకి దింపుతున్నట్టు మంగళవారం రాత్రి వెల్లడించింది.

మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సోమవారం హైదరాబాద్‌లో తన ఓటును నమోదు చేసుకున్నారు. అర్హులైన పట్టభద్రులందరూ నవంబర్ 6 లోగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.




Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.
https://epaper.navatharam.com